క్లుప్తంగా

మలేరియా సర్వే..



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన విప్పలగుంపులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మలేరియా సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటిని సందర్శించి జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరించి మందులను అందజేశారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నీటి నిల్వ ప్రాంతాల్లో యాంటీ లార్వా ద్రావణాన్ని చల్లారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, పద్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

6న తిరుకల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం హరిహర క్షేత్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి తిరుకల్యాణం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.45 నుంచి నిర్వహించే కల్యాణ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మేనేజర్‌కు సన్మానం



పీకేఓసీ-2 మేనేజర్ సురేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కార్మిక నేతలు, కార్మికులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 మేనేజర్‌గా పనిచేస్తున్న సురేశ్‌ను రిలే బీ కార్మికులు బుధవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో సీఎండీ బలరాం చేతులమీదుగా మణుగూరు ఏరియా ఉత్తమ అధికారిగా పురస్కారాన్ని అందుకున్న నేపథ్యంలో గని కార్మికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం, అధికార యూనియన్ నాయకులు రాంగోపాల్, కృష్ణంరాజు, అధికారులు లింగబాబు, భాంగ్యా, కృష్ణమూర్తి, రాందాస్, కార్మిక నాయకులు అశోక్, ఫిట్ కార్యదర్శులు, సేఫ్టీ మైన్స్ కమిటీ సభ్యులు, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగికి సత్కారం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కళాకారుడు, మాస్టర్ అథ్లెటిక్స్‌లో నేషనల్ గోల్డ్ మెడల్ విన్నర్, కవి ప్రసాద్‌ను భద్రాచలం బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6న అబుదాబి (దుబాయ్)లో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్‌కు అర్హత సాధించినందుగాను బీసీ ఐక్య వేదిక ప్రసాద్‌కు అభినందనలు తెలిపింది. బీసీ ఐక్య సమితి జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి రంగారావు, చారి, మల్లుబాబు, బండారి నాగేశ్వరావు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధపడాలి

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు సూచించారు. సారపాక సుందరయ్యనగర్‌లో మంగళవారం స్థానిక మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, ఆసరా పింఛన్ల పెంపు వంటి హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. హామీల అమలు కోసం ఈ నెల 6న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా నాయకురాలు పాపినేని సరోజిని, ద్రౌపతి, నాగమణి, మీనా, సాధిక పాల్గొన్నారు.

మృతదేహానికి అంత్యక్రియలు

అశ్వాపురం: ఊరూరూ తిరుగుతూ చెత్త సేకరిస్తూ జీవనం సాగిస్తున్న క్రమంలో భర్త మృతి చెందగా అశ్వాపురం పోలీసులు, నాయకులు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం లచ్చగూడేనికి చెందిన బాణోత్ శరత్‌బాబు, ఎస్‌కే.షాజహాన్(లక్ష్మి) భార్యాభర్తలు చెత్త సేకరిస్తూ పొట్టపోసుకుంటున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం అశ్వాపురం వచ్చి బస్టాండ్ ఆవరణలో ఉంటున్నారు. కాగా, శరత్‌బాబు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. తాము అనాథలమంటూ భర్త శవం పక్కన భార్య ఏడుస్తుండగా స్థానికులు గమనించి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్యకు సమాచారం ఇచ్చారు. ఆయన ఎస్సై మధుప్రసాద్‌తో కలిసి అక్కడికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. అనంతరం ఎంపీడీఓ ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, సిబ్బంది సహాయంతో పంచాయతీ ట్రాక్టర్‌లో మృతదేహాన్ని వైకుంఠధామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

సాగు నీరు పారేదెలా?

ఇసుక మేటలు ఇలా..

- ఏడు మెలికల వాగు కాలువలో పేరుకుపోయిన ఇసుక
- మూడు చెరువులకు సాగునీరు ప్రశ్నార్థకమే..
- ప్రతి ఏటా చి'వరి' తడికి రైతన్న కష్టాలు



ఇసుక మేటలతో కాలువ మధ్యలోనే నిలిచిన నీరు



కాలువ మధ్యలో ఎదురొచ్చే వర్రె ఇదే..

గుండాల: మారుమూల గిరిజనులు వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందాలని ఏడె మెళికల వాగుకు గతంలో మళ్లింపు కాలువ తీశారు. రూ.లక్షలు వెచ్చించి ఉపయోగంలోకి తెచ్చిన కాలువ నేడు ఇసుక మేటలతో నిండిపోయింది. దీంతో వందల ఎకరాలు సాగు భూమి ప్రశ్నార్థకంగా మారింది.

మండలంలోని సాయనపల్లి పంచాయతీ సరిహద్దు నుంచి పారుతున్న ఏడు మెళికల వాగును కొవడటంచ చెరువులోకి మళ్లింపు కాలువ చేసేందుకు 199798 సంవత్సరంలో ఐఫాడ్ కింద భద్రాచలం ఐటీడీఏ ద్వారా రూ. 6.19 లక్షల నిధులు మంజూరు చేశారు. కాగా అదే సంవత్సరం పనులు చేపట్టారు. రెండు కిలోమీటర్ల వరకు తీసే కాలవను ఒక్క కిలోమీటరు వరకు తీశారు. మధ్యలో రాయి పడడంతో రాయిని తొలగించేందుకు నిధులు సరిపోవని అధికారులు పనులను కొంతకాలం నిలిపివేశారు. కాలువ పనులు కావాలని గ్రామస్తులు పలుమార్లు అధికారుల చుట్టూ తిరగగా.. రెండో దఫా టీఎస్ఎఫ్(ట్రిబల్ స్లబ్‌ప్లాన్ గ్రాంటు) కింద రూ.10 లక్షలు మంజూరయ్యాయి. రెండేళ్లపాటు బ్లాస్టింగ్‌కు అనుమతి కోసం చూసి, చివరికి పనులు చేయించారు. ప్రస్తుతం ఇసుకమేటలతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

మూడు గ్రామాలు.. నాలుగు చెరువులు

మళ్లింపు కాలువలో ఇసుక మేటలు తొలగిస్తే కొడవటంచ, నాగారం, పాలగూడెం గ్రామాలకు చెందిన ఇసుక వర్రె చెరువు, తాళ్ల చెరువు, రాయిమాక వర్రె చెరువు, నాగారం ఊర చెరువుల్లోకి నీరు చేరుతుంది. ఈ చెరవుల కింద ఆయా గ్రామాలకు చెందిన 300ల మంది రైతులకు సంబంధించి సుమారు 800 ఎకరాలు సాగులో ఉంది. కాలువ నీరు రాకపోవడంతో ప్రస్తుతం ఆ చెరువుల్లోకి చేరే వర్షం నీళ్లపైనే రైతులు ఆధారపడుతున్నారు. మళ్లీంపు కాలువకు మధ్యలో మరో వర్రె ఎదురుగా వరదపోటేస్తుంది. దీంతో ఇసుకమేట ఏర్పడి చెరువుల్లోకి నీరు చేరడం లేదు. ఆ వర్రైపై చెక్‌డ్యాం నిర్మించి, ఆ నీటిని సైతం ప్రధాన కాలువకు కలిపినట్లయితే చెరువుల్లో నీరు పుష్కలంగా వచ్చి చేరుతుందని రైతులు వేడుకుంటున్నారు.

పోడు వ్యవసాయమే దిక్కు..

తక్కువ వర్షాల కారణంగా చెరువుల్లో నీరు సరిపడక వరి పంట చేతికందడం లేదని, దీంతో పోడు వ్యవసాయమే చేయాల్సివస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు మాత్రమే పండిస్తున్నప్పటికీ అధిక వర్షాలు, వర్షాలు లేక ఏదో రకంగా దిగుబడులు రావడం లేదని వాపోతున్నారు. ఇసుక మేటలు తొలగించకపోవడంతో కాలువ నీరు మరో వర్రెలోకి వృథాగా పోతుందని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టు తిరుగుతున్నా పట్టించుకోడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ పనులు తిరిగి ప్రారంభించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



ఇసుక మేటలు తొలగించాలి..



కాలువకు ఎదురుగా వచ్చే వర్రె ద్వారా ఇసుకమేటలు వేస్తున్నాయి. నీళ్లు చెరువులకు రావడం లేదు. ఆ వర్రెకు చెక్‌డ్యాం నిర్మించి, ఇసుకమేటలు తొలగించాలి.

– ఈసం యానయ్య, కొడవటంచ

వరి పండించడం కష్టమవుతోంది..



ఏడుమెళికల వాగు మళ్లీంపు కాలువలో ఇసుక ఏర్పడి నీళ్లు రాకపోవడంతో చెరువులకు నీళ్లు అందడం లేదు. చివరి తడికి కష్టం అవుతోంది. వరి పంట చేతికి రావడం లేదు.

– ఈసం మల్లయ్య, కొడవటంచ

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



దుమ్ముగూడెం: ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



చంద్రుగొండ: దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట: భూ భారతి చట్టాన్ని అనుసరించి రెండో రోజు బుధవారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. మండలంలోని గణేష్‌పాడు, మల్కారం గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించగా.. మొత్తంగా 510 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్ రెడ్డి, డీటీ వాణి, ఆర్‌ఐలు భిక్షం, వీరాస్వామి, జేపీ నాయక్ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మండల పరిధిలోని గుట్టమల్లారంలోని రైతువేదికలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా.. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు హాజరు కాలేని రైతులు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం భూ భారతిలో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీటీ రామారావు, ఆర్ఐ గోపి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, మండల కాంగ్రెస్ నాయకులు పి.నవీన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, ఐతనబోయిన సతీష్, సామా శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మరోవైపు, ఇదే రైతువేదికలో రైతులకు విత్తనోత్పత్తి పథకం ద్వారా నాణ్యమైన విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాహుల్‌రెడ్డి, ఏఈఓ కొమరం లక్ష్మణరావు, డీటీ రామారావు, ఆర్ఐ గోపి, రైతులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని జమ్మిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సును స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సందర్శించారు. దరఖాస్తుల తీరుతెన్నులపై తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. కాగా, జమ్మిగూడెం, గుమ్మడవల్లి, కోయ రంగాపురం గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో అధికారులు రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్, ఆర్‌ఐలు కృష్ణ, పద్మావతి, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, కార్యదర్శులు కార్తీక్, బాబు, రాంబాబు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని సీతాయిగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన భూభారతి సదస్సులో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, మాజీ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని పాతమారేడుబాక గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జగదీశ్వరరావు, ఆర్‌ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



కరకగూడెం: పురుగు మందుల దుకాణంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఎస్సై, ఏఓ

కరకగూడెం: నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి ఛటర్జీ, కరకగూడెం ఎస్సై నాగేశ్వరరావులు హెచ్చరించారు. ఈ మేరకు వారు బుధవారం మండల కేంద్రంలో పలు పురుగుమందుల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన లేదా అనుమతి లేని 'నకిలీ విత్తనాలను' ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అటువంటి విత్తనాల వినియోగం వల్ల పంటలకు, భూమికి, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, రైతులు కూడా మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

చింతకుంటను సందర్శించిన ఎండీపీఓ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామపంచాయతీలోని చింతకుంట గ్రామాన్ని ఎంపీడీఓ ముత్యాలరావు బుధవారం సందర్శించారు. వలస ఆదివాసీ గ్రామంలో పరిస్థితులు వారి సమస్యలు ఎంపీడీఓ తెలుసుకున్నారు. రహదారి, తాగు నీరు, కరెంటు, అంగన్‌వాడీ భవనం వంటి సమస్యలు స్థానికులు ఎంపీడీఓకు వివరించారు. చింతకుంట గ్రామ సమస్యలు, ముఖ్యంగా కరెంటు సౌకర్యంపై కలెక్టర్ నివేదిక అందజేస్తామని ఎంపీడీఓ స్థానికులకు తెలియజేశారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామాన్ని ఎంపీడీఓ ముత్యాలరావు సందర్శించి పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు



అంతర్గత రోడ్డులో తనిఖీ చేస్తున్న సీఐ నాగరాజు రెడ్డి

అశ్వారావుపేటరూరల్: ప్రధాన, అంతర్గత రోడ్లను ఆక్రమిస్తే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ పింగళి నాగరాజు రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణ కేంద్రంలోని జీవమణి హాస్పిటల్ రోడ్డుతోపాటు ప్రధాన రహదారుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్గత రోడ్లలో ఉన్న ఆక్రణలను గుర్తించి యజమానులకు అవగాహన కల్పించారు. అలాగే రోడ్లపై ఉన్న వాహనాలు, దుకాణాల బోర్డులు, వ్యాపారుల సామగ్రిను అక్కడిక్కడే తొలగించేలా చర్యలు చేపట్టారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్సై యయాతి రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

దమ్మపేట: వ్యవసాయ భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించి, తద్వారా రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు జంపమ్మ, శిరీషలు సూచించారు. బుధవారం మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే దిశగా సాగులో అనుసరించాల్సిన ఆధునిక వంగడాలు, పద్ధతులు, మెళకువల గూరించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉంటారని, వారి సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, కార్యదర్శి మురళీ, స్థానిక రైతులు నూనె శ్రీను, భాను పాల్గొన్నారు.

వెంకన్న భూములకు పట్టాలు ఇవ్వండి



డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరికి సిబ్బందితో కలిసి వినతిపత్రం ఇస్తున్న ఆలయ మేనేజర్

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వెంకటేశ్వరస్వామికి అగ్రహారంగా ఉన్న భూములకు భూభారతిలో పట్టాలు ఇవ్వాలని ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరికి వినతిపత్రం అందించారు. మండలంలోని తొట్టిపంపు పంచాయతీలో నిర్వహించిన భూభారతి సదస్సులో ఆలయ మేనేజర్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు. అయితే వేంకటేశ్వరస్వామికి మొత్తం 2,464 ఎకరాల భూమి ఉంది. అందులో సర్వే నంబర్ 40/1/బ లో 200 ఎకరాల భూమి ఈ ప్రాంత భూస్వామి కాళ్ళూరి వంశస్తులు దేవస్థానానికి దానంగా ఇచ్చారు. అయితే ఆ భూములు గిరిజన, గిరిజనేతర రైతులు కౌలుపై సేద్యం చేస్తున్నారు. అందులో 22 ఎకరాల భూమి సీతారామ కాలువలో ముంపుగా పోయింది. సదరు భూమికి సంబంధించిన పరిహారం దేవస్థానానికి రాలేదు. ఇదిలాఉండగా మిగిలిన 178 ఎకరాల విషయమై కొంతమంది దళారులు కౌలు రైతులకు పట్టాలు ఇప్పిస్తామని ప్రచారం చేస్తున్నారని ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ తెలిపారు. స్వామివారి భూములకు సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని అవసరం అయితే కోర్టును ఆశ్రయిస్తామని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటమే ధ్యేయం

చర్ల: ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించడమే ధ్యేయంగా సీపీఐ ముందుకు సాగుతోందని ఆ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు అన్నారు. ఈ నెల 10న సీపీఐ చర్ల మండల 20వ మహాసభ నిర్వహించనుండగా సభకు సంబంధిచి మండల కౌన్సిల్ సమావేశం పార్టీ సీనియర్ నాయకులు నూపా తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్ల మండల ప్రాంతంలో అనేక గ్రామాల్లో సీపీఐ పోరాట ఫలితంగా పేదలకు ఇళ్ల స్థలాలు, పోడు భూములు దక్కాయని అన్నారు. మండల మహాసభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూప పోతయ్య, నాయకులు పాలంచ రామారావు, చల్ల లక్ష్మీనారాయణ, ఉప్పలూరి నాగరాజు, కోడిరెక్కల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



కరకగూడెం: లబ్ధిదారురాలికి మంజూరుపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ, కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి, నారంవారిగూడెం కాలనీ గ్రామ పంచాయతీల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఆయా పంచాయతీల్లో కార్యదర్శుల చేతుల మీదుగా తొలి విడతగా కేటాయించిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శులు రజిని, వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ గ్రామ నాయకులు సత్యం రామకృష్ణ, సాధు జోషి, వేముల అశోక్, కొవ్వాసి దుర్గారావు, నారం కృష్ణ, పి.నరేష్, మణికంఠ పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలో పారదర్శకంగా 'ఇందిరమ్మ ఇళ్ల' లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ఎంపీడీఓ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం కరకగూడెం మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొదటి జాబితాలోని 19మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, పార్టీ నాయకులు ఎర్ర సురేష్, జలగం కృష్ణ, గొగ్గలి రవి, అఫ్షాఫున్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం గడ్డుకాలమే..!

- వానపడితే సంద్రంలా ముంపు ప్రాంతాలు
- వరదలొస్తే ఇళ్లు ఖాళీ చేయాల్సిందే..
- పునరావాసం కల్పిస్తామన్న నాటి ప్రభుత్వం
- నేటికీ నెరవేరని హామీ



గోదావరి వరద నీటిలో మునిగిన సున్నంబట్టి గ్రామంలోని ఓ పూరిల్లు (ఫైల్)



హైలెవల్ వంతెన నిర్మించాల్సింది ఇక్కడే..

దుమ్ముగూడెం: వర్షాకాలం వస్తుందంటేనే మండలంలోని ముంపు ప్రాంత గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. వర్షాకాలంలో గోదావరికి వచ్చే వరదలతో ప్రతీ ఏడాది ఆస్తినష్టం, పశునష్టం, పంటనష్టం వాటిల్లుతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ముంపు గ్రామాలైన పర్ణశాల, ఎల్ఎన్ రావుపేట, కాశీనగరం, సున్నంబట్టి, వర్క్‌షాప్ వర్షాకాలం మూడు నెలలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకీడుస్తున్నారు. గోదావరికి వరదలు వచ్చాయంటే అధికారుల అలజడి మొదలవుతుంది. వెంటనే గ్రామాలు ఖాళీ చేయాలని పునరావాస కేంద్రాలకు తరలిరావాలని ఆదేశాలు జారీ చేస్తుంటారు. సున్నంబట్టికి వెళ్లే రహదారిలో ముందుగా కల్వర్టు మునిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో సున్నంబట్టి గ్రామానికి బాహ్యప్రపంచానికి సంబంధాలు ఉండవు. నీట మునిగే కల్వర్టు దగ్గర హెలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ఎన్నిసార్లు విన్నవించిన చెవిటోడి ముందు శంఖం ఊదిన చందం లాగానే తయారైంది.

మూడేళ్ల క్రితమే హామీ..

2022, జూలై నెలలో వచ్చిన గోదావరి వరదలతో భద్రాచలం వద్ద నీటిమట్టం 73.5 అడుగులకు చేరి సున్నం బట్టి, కాశీనగరం గ్రామాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడం, మిగతా గ్రామాల్లో భారీగా ఆస్తి నష్టం సంభవించడం తెలిసిన విషయమే. అప్పటి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వరదలతో అతలాకుతలమైన గ్రామాలను సందర్శించి సున్నం బట్టీ, కాశీనగరం గ్రామాల ప్రజలకు మైదాన ప్రాంతాలలో పునరావాసం కింద స్థలం కేటాయించి ఇళ్లు నిర్మాణం చేపట్టి అందజేస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ అది హామీగానే మిగిలి ఉంది. ముందుకు అడుగులు పడలేదు.


నిలిచిన కాంక్రీట్ గోడ నిర్మాణం..

గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బహుళార్థక సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు తుడిచిపెట్టుకుపోయే పరిస్థితులు కనపడుతున్నాయి. సీతమ్మ సాగర్ బ్యాక్ వాటర్ వల్ల ముంపుకు గురి కాకుండా సున్నంబట్టి నుంచి చర్ల మండలం వరకు భారీ కరకట్టను నిర్మిస్తుండటంతో ఇక గ్రామాలు మునిగే పరిస్థితులు రావని అధికారులు ప్రజలకు చెబుతున్నారు. కానీ సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు కేంద్ర పర్యావరణ అనుమతులు లేవని నిర్మాణాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి.

ఈ ప్రభుత్వమైనా స్పందించేనా..?

ప్రతి ఏటా గోదావరికి వచ్చే వరదలతో తీవ్రంగా నష్టపోతున్న ముంపు ప్రాంత గ్రామాల ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. వరదల సమయంలో ప్రాణనష్టం తప్ప ఇళ్లు, పశు సంపద, పంటలు కొట్టుకుపోతుండటంతో ప్రజలు ఆర్థికంగా బాగా దెబ్బతింటున్నారు. వరద సహాయంగా ప్రభుత్వాలు ప్రకటించే నష్ట పరిహారం అరకొర నిధులు ఎటు పక్కకూ సరిపోక ప్రజలు అప్పులు తెచ్చుకుని మరలా ఇళ్లు కట్టుకోవాల్సిన పరిస్థితులు కళ్ల ముందు కనపడుతున్నాయి. ప్రభుత్వం మండలంలోని ముంపు ప్రాంత ప్రజలకు వరదల సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రభుత్వమైన మండలంలోని వరద ముంపు ప్రాంత ప్రజలకు వరద భారీన పడకుండా రక్షణ చర్యలు చేపడతారా.. లేక మైదాన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపుతారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.


వరదల నుంచి రక్షించండి..



ప్రతి ఏటా గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆర్థికంగా నష్టపోతున్నాం. వరదలు వచ్చిన ప్రతిసారీ పునరావాస కేంద్రాలకు తరలించడం, గోదావరికి ఎక్కువ వరద వస్తే కట్టుబట్టలతో బయటకు రావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాలకులు మా బాధను అర్థం చేసుకుని గోదావరి వరదల భారీన పడకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజలకు రక్షణ కల్పించాలి. వర్షకాలం నిద్రలేని రాత్రుల నుంచి విముక్తి కలిగించాలి.

– యంబడి అర్జునరావు, సున్నంబట్టి

శాశ్వత పరిష్కారం చూపాలి..



ప్రతి ఏటా వచ్చే గోదావరి వరదలతో వరద ముంపు గ్రామాల ప్రజలు తీవ్రంగా ఆస్తినష్టం, పశునష్టం వాటిల్లుతోంది. గత ప్రభుత్వం ఇచ్చిన పునరావాస హామీ అలాగే మిగిలి ఉంది. ప్రస్తుత ప్రభుత్వమైన మైదాన ప్రాంతంలో స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి బాధిత కుటుంబాలకు అందజేయాలి. గత కొన్నేళ్లుగా సున్నంబట్టి, కాశీనగరం గ్రామాల ప్రజలు వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– కారం పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి